క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు



బుట్టాయిగూడెంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కన్నాయిగూడెం: గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో శుక్రవారం 'సాక్షి'లో 'అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సిబ్బందితో శనివారం పలు గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు.

నైపుణ్యాన్ని పెంపొందించాలి

వాజేడు: విద్యార్థులల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని వాజేడు, కొప్పుసూరు, ధర్మవరం కాంప్లెక్స్ స్థాయిలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాజేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వరదలు తీవ్రంగా ఉంటే వాగులు దాటొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం: నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రజలు వాగులను వరదలను దాటాలని ప్రయత్నం చేయొద్దని ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండలంలోని కంతనపల్లి వద్ద దొంగలగుట్ట ప్రధాన రహదారిపై లోలెవల్ వంతెనపై వరద తీవ్రంగా ఉండడంతో ప్రయాణికులను ఆపి పలు సూచనలు చేశారు. వరదలు దాటాలని ప్రయత్నం చేస్తే ప్రమాదాల భారిన పడుతారన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కిషన్

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన మోరె రజినీకాంత్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట సంఘం నాయకులు చింతల రవి, కిరణ్, వంశీ, విఘ్నేష్, శివ, రాంబాబు, రవి తదితరులు ఉన్నారు.

కూలిన పెంకుటిల్లు



వాజేడు: విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లికి చెందిన ఓ పెంకుటిల్లు శనివారం కూలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఏడ్జెర్లపల్లి గ్రామానికి చెందిన చెన్నం సమ్మయ్య, వెంకటమ్మలు ఇంట్లోనే ఉన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు పడిపోతున్నట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇంట్లో ఉన్న వారు బయటకు పరుగులు పెట్టారు. వారు బయటకు వచ్చిన వెంటనే ఇళ్లు నేలమట్టమైంది. దీంతో ఇంట్లో వస్తువులు తీసుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో వృద్ధ భార్యాభర్తలు కట్టుబట్టలతో ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ద్విచక్రవాహనం దగ్ధం



వాజేడు: షార్ట్ సర్క్యూట్‌తో ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి కొత్తూరులో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు వాసం ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై ఉదయం బయటకు వెళ్లి వచ్చిన తరువాత ఇంటి సమీపంలో ఉన్న పాకలో ఉంచాడు. కొంత సమయం తర్వాత బయటకు వెళ్లడం కోసం ద్విచక్ర వాహనం స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు వచ్చాయి. ట్యాంకులో సుమారుగా రూ.800 పెట్రోల్ ఉండడంతో మంటలు ఎగిసిపడి వాహనం దగ్ధమైంది. ఏడు నెలల క్రితమే వాహనం కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

వానొస్తే నరకమే..



గోవిందరావుపేటలో వాగును తలపిస్తున్న గ్రంథాలయం పక్కన ఉన్న రోడ్డు



పస్రాలోని అభ్యుదయ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు



పస్రాలోని 11వ వార్డులో..

- సైడ్ కాల్వలు లేక రోడ్లపైనే నీళ్లు
- ఒక వైపు వర్షం.. మరో వైపు బురద
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గోవిందరావుపేట: వానొస్తే మండలంలోని పలు గ్రామాల్లోని అంతర్గతరోడ్లు చెరువులుగా మారుతున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వాన, మరో వైపు రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, బురదతో నడిచే పరిస్థితి లేకుండా పోతుంది. బురదరోడ్డులో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదానికి గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా మండల కేంద్రం, పస్రాలోని కాలనీవాసులు రోడ్డెక్కాలంటేనే వణికిపోతున్నారు. బురదలో రాకపోకలు సాగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. అలాగే చెత్తాచెదారం పేరుకుపోయి అంతర్గతరోడ్లు బురదమయం కావడంతో ప్రజలు అనారోగ్యాకి గురయ్యే ప్రమాదం ఉంది. ప్రతీ సంవత్సరం వర్షకాల సీజన్‌లో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నారు. గ్రామాల్లో సైడ్ కాల్వలు లేకపోవడంతోనే నీరు నిలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు సీసీ రోడ్డులు నిర్మించాలని కోరుతున్నారు.

చెరువును తలపిస్తోంది



చిన్న వర్షం పడితే చాలు 4వ వార్డులోని మా కాలనీ చెరువును తలపిస్తోంది. పక్కన ఉన్న వాగులోని నీరు కూడా మా కాలనీలోని రోడ్ల మీదికి, ఇళ్లల్లోకి వస్తుంది. ప్రతీ సంవత్సరం వర్షకాలంలో ఇబ్బంది పడుతున్నాం

- పర్రెం రఘు, గోవిందరావుపేట

సీసీ రోడ్డు వేయాలి



వర్షం పడిన ప్రతిసారి పస్రా గ్రామంలోని అభ్యుదయ కాలనీలో రోడ్లు అన్ని బురదమయంగా మారుతాయి. ఆ రోడ్ల మీద నుంచి నడవాలి అంటే భయం వేస్తుంది. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్లు వేయాలి

-జిట్టబోయిన రమేశ్, పస్రా

భూ సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డీఓ వెంకటేశ్



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశ్

మంగపేట: భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ వెంకటేశ్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తులను పనితీరును పరిశీలించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల వివరాలు, ఇప్పటి వరకు పరిష్కరించిన వాటి వివరాలను తహసీల్దార్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంచుకోవాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: విద్యార్థులు దేశ భక్తి పెంచుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థరెడ్డి, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్గిల్‌లో అమరులైన వీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విభిన్న భాషలతో విభిన్న భౌగోళిక పరిస్థితులతో విభిన్న సంస్కృతులతో మరో ప్రపంచంగా పిలవబడుతున్నది కేవలం భారతదేశం మాత్రమేనని అన్నారు. కార్గిల్ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా బైక్‌లు నడపొద్దు



ఫన్నీ బాయ్స్‌ను అభినందిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సైలు

- సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఫన్నీబాయ్స్ రూపొందించిన 'పొరపాటు' షార్ట్ ఫీల్మ్ ఎంతో అద్భుతంగా ఉందని సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే కలిగే అనార్థాలపై షార్ట్‌ఫీల్మ్‌ను రూపొందించిన ఫన్నీ బాయ్స్ యువకులు శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ అభినందించి మాట్లాడారు. చిన్న వయసులో ఉన్న విద్యార్థులు ఎంతో ముందు చూపుతో ఆలోచించి పొరపాటు అనే కథనంతో హెల్మెట్ లేక రోడ్డు ప్రమాదం జరిగితే ఎలాంటి నష్టాలు ఉంటాయని బుల్లితెరపైకి ఎక్కించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువత మద్యం సేవించి వాహనాలను అతివేగంగా నడిపి రోడ్డుపై వెళ్లే వారికి ఢీకొని వారి కుటుంబమే కాకుండా ఎదుటి వారి కుటుంబంలో కూడా విషాధాన్ని నింపుతున్నారన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడుపొద్దన్నారు. ఫన్నీబాయ్స్ ఇలాంటి బుల్లితెర చిత్రాలను మరిన్ని తీయాలని, సమాజానికి మంచి మేసేజ్ ఇవ్వాలని నిర్వాహకులు రాము, మహేష్, రాజేష్, ప్రశాంత్‌లకు తెలిపారు. సీఐతోపాటు ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం ఎస్సైలు రాజ్‌కుమార్, టీవీ ఆర్ సూరి, వెంకటేశ్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆశీష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిప్పాపురం, ఆలుబాక, చొక్కాల, మరికాల, వెంకటాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు పవన్, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కొడిశాల వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బయ్యక్కపేటను ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాల పరిశీలించారు. ఎన్ఎస్ఐ పాజిటీవ్ కేసుల వివరాల గురించి ఆశవర్కర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని నార్లాపూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్, డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ కేసులు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని ఆర్ఎంపీ వైద్యుడికి సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్ ఉన్నారు.

అగ్నిమాపక భవనానికి రూ.2 కోట్లు



మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయం భవనం కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మేడారంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ భవనం కోసం రూ. 5 కోట్లు మంత్రి సీతక్క కృషితో మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, నర్సింగరావు, గంపల శివ, రథన్, బాబు, లక్కి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మాదవరావుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జీవన ప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సివిక్స్, ఎకనామిక్స్, నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పీజీ సీఆర్టీ సివిక్స్ ఎంఏ పొలిటికల్ సైన్స్ , బీఈడీ, ఎకనామిక్స్ ఎంఏ ఎకనామిక్స్ , బీఈడీ, నర్సింగ్‌కు బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి ఉండాలని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. అలాగే కళాశాలలో సీఈసీలో 26, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 25 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆరో తరగతిలో 10 సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

చల్వాయి కేజీబీవీలో..

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి కేజీబీవీలో రెండు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మీ తెలిపారు. పీజీఆసీఆర్‌టీ కెమిస్ట్రీ, సీఆర్‌టీ బయోలాజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. దరఖాస్తులను ఈ నెల 28 నుంచి 31 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మంగపేటలో..

మంగపేట : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియేట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు బోధించేందుకు కాంట్రాక్టు పద్ధతిపై అధ్యాపకులు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషలాఫీసర్ పాయం భాగ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, మ్యాస్, ఫిజిక్స్ సబ్జెక్టులకు ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్మీడియేట్‌లో స్పాట్ అడ్మిషన్లు జరుతున్నాయని ఎంపీసీలో 24, బైపీసీలో 15 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరో తరగతిలో 10, ఎనిమిదో తరగతిలో 08, తొమ్మిదో తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం: కాటారం మండలం విలాసాగర్ మానేరు నుంచి మహాముత్తారం మండల కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం మండల కేంద్రానికి సమీపంలోని చింతకాని క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన దిలీప్, కాటారం మండలం మద్దులపల్లికి చెందిన శ్రీధర్ అనే ఇద్దరు డ్రైవర్లు మండల కేంద్రం మీదుగా ఇసుక ట్రాక్టర్లు తీసుకొని మహాముత్తారం వైపుగా వెళ్తున్నారు. గమనించిన ఎస్సై, సిబ్బంది చింతకాని క్రాస్ వద్ద ట్రాక్టర్లను ఆపి విచారించగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- వనవాసీ కల్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న మైపతి సంతోశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజన ఇల వేల్పుల జాతర ఆలయాల అభివృద్ధి ప్రభుత్వం నిధులు కేటాయించాలని వనవాసీ కల్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మైపతి సంతోష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లే జిల్లాలోని కోయ వేల్పుల జాతరల అభివృద్ధికి కేటాయించాలన్నారు. నాయకపోడు లక్ష్మీదేవర ఆలయాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి గిరిజన గూడెంలోని గుళ్లను మేడారం జాతర సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. గిరిజన సంస్కృతి పరిరక్షణ కోసం అందరం కలిసి పనిచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సభ్యులు ఈర్ప స్వామి, జగదీశ్, రాజు, సలెందర్ సాంబయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల సాగు మేలు

- మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న కుమార్ యాదవ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రకృతి వ్యవసాయ పంటల సాగు లాభాదయకంగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు రేఖ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రకృతి సాగుతో భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి ముందుతరాల వారికి మంచి భవిష్యత్‌ను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి, వెలుగు రేఖ ఎన్‌జీఓ సీఈఓ రజిత, ట్రైనర్ సాంబయ్య, ఏఈఓ దుర్గ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించి ముందు తరాలవారికి ఆరోగ్యవంతమైన జీవితం అందించాలని ఎంఏఓ జితేందర్ అన్నారు. మండలంలోని రంగాపూర్, ముత్తాపూర్ గ్రామాల్లో వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జితేందర్ హాజరై మాట్లాఆరు. వ్యవసాయంలో తక్కువ పెట్టుబడి పెట్టి అధిక లాభాలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ సీఈఓ రజిత, ఏఈఓలు దాదా సింగ్, గోపాల్ రెడ్డి, ట్రైనర్ సాంబయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్



సిద్ధార్థరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల బృందం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ వరంగల్ వారి సహకారంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న వివిధ స్కీమ్స్‌పై విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుక ప్రారంభించగా ముఖ్య అతిథిగా (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ) డీఈఈటీ జిల్లా బాధ్యులు సిద్ధార్థ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు పలు రకాల కోర్సులను నేర్చుకుంటే భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్ షాపునకు హాజరైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్వేష్ చింతల, భాస్కర్, దేవీలాల్, హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్.వెంకటయ్య, అధ్యాపకులు నవీన్, జ్యోతి, కనీస్‌ఫాతిమా పాల్గొన్నారు.

ఆరేళ్లలో వంద బైక్‌లు చోరీ

- వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ నిందితుడు

ఆలేరు: ఆరేళ్లలో సుమారు వంద బైక్‌ల చోరీకి పాల్పడిన వ్యక్తి శనివారం ఆలేరులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు వివరాలను ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ కొండల్‌రావు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కంప విజయ్ చిన్నతనంలోనే అతడి తల్లి మృతి చెందింది. తండ్రి మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. తల్లి బంధువుల వద్ద పెరిగిన విజయ్ వరంగల్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో కుకింగ్ పనిచేశాడు. విలాసవంతంగా జీవించాలనే ఆలోచనతో నేరాల బాట పట్టాడు. ఇందుకు సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 2019లో ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గుడిలో చోరీకి పాల్పడి జైలు పాలయ్యాడు. జైలు నుంచి విడుదలైన తరువాత బైక్ చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా వరంగల్, మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌లు అపహరించాడు. వాటిని రూ.20–30వేలకు విక్రయించి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఓ దోపిడీ కేసులోనూ విజయ్‌పై మట్వాడ పోలీసులు పీడీ యాక్టు ప్రయోగించారు. ఒక ఏడాదిపాటు జైలులో ఉన్నాడు. విడుదలైన తర్వాత 2022 నుంచి 2023 వరకు ఎనుమాముల, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ, హనుమకొండ, ఆత్మకూర్‌ల పరిధిలో 54 బైక్‌ల చోరీకి పాల్పడ్డాడు. ఎనుమాముల పోలీసులు 2023లో అరెస్టు చేసి, జైలుకు పంపించారు. ఈ ఏడాది జూన్ 17న విడుదలైన విజయ్ 15రోజుల్లో ఆలేరు, జనగామ, భువనగిరిలో మూడు బైక్‌లను అపహరించాడు.

పెంబర్తి నుంచి ఆలేరు వైపు వస్తుండగా..

ఆలేరు హైవేలో శనివారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పెంబర్తి నుంచి ఆలేరు వైపు బుల్లెట్, యాక్టీవా వాహనాలపై ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా వస్తున్నారు. ఈ రెండు వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులు అనుమానంతో ఆపారు. వాహనాల పత్రాలు చూపించాలని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ఆలేరు, జనగామ, భువనగిరిలో బైక్‌లు చోరీ చేసినట్లు నేరం అంగీకరించడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. విజయ్‌కు సహకరించిన జనగామకు చెందిన మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని పూచీకత్తుపై పంపించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు జనగామ సమీపంలోని చెట్ల పొదల్లో దాచిన మరో రెండు చోరీ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కృషి చేసిన క్రైం కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, మహేష్‌లకు సీపీ ఆదేశాల మేరకు సీఐ రివార్డు అందజేశారు. సమావేశంలో ఎస్సై వినయ్, ఏఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

వెంకటాపురం(ఎం): జిల్లా కేంద్రంలో ఆగస్టు 5న నిర్వహించే సీపీఐ జిల్లా తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బండి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీపీఐ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బండి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా కొక్కుల రాజేందర్, సభ్యులుగా గుర్రం రమేష్, జనగాం రజిత, దాసరి సరోజన, రామస్వామి, మోహన్ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): జిల్లా కేంద్రంలో ఆగస్టు 5న నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలో ప్రజా సమస్యలపై చేయాల్సిన పోరాటాలను చర్చించనున్నట్లు తెలిపారు.